నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
8 | ఖమ్మం, శనివారం 18 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM



కేఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లకు అభినందనలు తెలుపుతున్న అజయ్

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై
అనునిత్యం పోరాడాలి

- దీటైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ఖమ్మం నగరాభివృద్ధికి కృషిచేయాలి
- బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశంలో మాజీ మంత్రి అజయ్‌కుమార్
- కేఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా కర్నాటి, డిప్యూటీ లీడర్‌గా మక్బుల్

ఖమ్మం, జనవరి 17: కేఎంసీ పాలకవర్గ సమావేశాల్లో ప్రజా సమస్యలపైనా, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపైనా బీఆర్ఎస్ కార్పొరేటర్లు పోరాడాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రతి పక్ష పాత్ర సరైన విధంగా పోషిస్తూ నగరాభివృద్ధికి కృషి చేయాలని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎవరి బెదిరింపులకూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఖమ్మంలోని మమత ఆసుపత్రి ఆవరణలో గల అజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఖమ్మం కార్పొరేషన్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్‌గా సీనియర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా షేక్ మక్బుల్‌ను బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనంతరం జరిగిన సమావేశంలో మాజీ మంత్రి అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉచిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందిందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయ చేతకాని ప్రభుత్వమని, ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందని దుయ్యబట్టారు. కర్నాటి కృష్ణ మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించక ఆరునెలలు దాటిందన్నారు. నగర సమస్యలు పట్టించుకునే నాథుడేలేడని, పారిశుధ్యం, వీధిలైట్లు అనేది కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి పట్టించుకోవట్లేదని విమర్శించారు. చెత్త సేకరించే ఆటోలు మూలనపడ్డాయని, కార్పొరేటర్లు ప్రొటోకాల్ పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సీనియర్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం

తొమ్మిది పంచాయతీల పార్టీ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

సమావేశంలో మాట్లాడుతున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

టేకులపల్లి, జనవరి 17: గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టేకులపల్లి మండలంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, జిల్లా నాయకుడు లక్కినేని సురేందర్‌రావులతో కలిసి రాంపురం, కొత్తతండా(పి), తావుర్యా తండా, తడికలపూడి, కోక్యాతండా, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, సులానగర్, ముద్రాస్‌తండా, బిల్లుడుతండా గ్రామపంచాయతీల్లో శుక్రవారం ఆమె విస్తృతంగా పర్యటించి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రియానాయక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తే విజయం మనదే అవుతుందన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా పార్టీ అండగా ఉంటుందని, ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలునాయక్, మండల నాయకులు బానోత్ కిషన్‌నాయక్, భూక్యా రమేశ్, భూక్యా పాపానాయక్, బర్మావత్ శివకృష్ణ, బానోత్ రవి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

- ఒకే రెవెన్యూ.. 16 పంచాయతీలు.. 22 వేల ఎకరాల విస్తీర్ణం
- సేమ్ సర్వే నెంబర్లతో రెండు చోట్ల పంట భూములు
- దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- సాగు భూములు ఉండి కూడా హక్కుపత్రాలు లేని దైన్యం
- తాజాగా 'రైతు భరోసా' కోసం సర్వే చేస్తున్న అధికారులు
- పట్టాదారు పాస్ పుస్తకాల్లేక ఆందోళన చెందుతున్న రైతులు

టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయం

వీడని చిక్కుముడి..
బేతంపూడి

టేకులపల్లి మండలంలోని బేతంపూడి రెవెన్యూ విలేజ్ వీడని చిక్కుముడిగా ఉంది. ఇది ఇప్పటి సమస్య కాదు.. దశాబ్దాలుగా వస్తున్నది. ఒక్క రెవెన్యూ గ్రామంలో 16 పంచాయతీలు, 22 వేల ఎకరాలు ఉన్నాయి. భూమి రికార్డులు రెండు అడంగల్ పహాణీలు బేతంపూడి, సులానగర్‌గా ఉన్నాయి. రెండు పహాణీల్లోనూ సర్వే నెంబర్లు 1 నుంచి ప్రారంభం కావడంతో పరిష్కరించలేని సమస్యగా ఉండిపోయింది. ఈ నేపథ్యంలో ఎందరో రైతులు పట్టాలు లేక ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం పొందలేకపోతున్నారు. భూమి ఉండి కూడా ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదని మదనపడుతున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతు భరోసా' పథకానికి లబ్ధిదారులను గుర్తించే పనిలో భాగంగా అధికారులు సర్వే చేస్తున్నారు. దీంతో భూముల సర్వే, లబ్ధిదారుల ఎంపిక ఎలా చేస్తారోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

-ఇల్లెందు, జనవరి 17

తరతరాలుగా వస్తున్న తమ భూ సమస్యలను పరిష్కరించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు బేతంపూడి రెవెన్యూ విలేజ్ రైతులు. స్వాతంత్ర్యం రాక ముందు తాతముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకు సాగు చేస్తున్నారే కానీ పట్టాలు ఉండవు.. బ్యాంక్‌లో వ్యవసాయం రుణాలు ఇవ్వరు.. విద్యుత్ లైన్ కోసం అనుమతి ఇవ్వరు.. మొత్తానికి భూమి ఉండి కూడా రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా ఉంది. 1956లో బేతంపూడి రెవెన్యూ పరిధిలో భూమి శిస్తులు బ్లాక్ నెంబర్లలో, నిజాం కాలం నుంచి రికార్డుల ద్వారా వసూలు చేసేశారు. 1982 తరువాత తాలూకాలు రద్దు చేసి మండలాలు ఏర్పాటు చేసిన క్రమంలో అధికారుల నిర్లక్ష్యం వలన ఆరు రెవెన్యూ విలేజ్‌లు కావలసిన ప్రాంతాన్ని ఒకే రెవెన్యూ విలేజ్‌గా ఏర్పాటు చేశారు. దీనివల్ల గతంలో ఆరు గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రస్తుతం 16 గ్రామ పంచాయతీలున్నాయి. రెవెన్యూపరంగా 22 వేల ఎకరాల భూమి ఉంది. భూమి రికార్డులను రెండు అడంగల్ పహాణీలు ఒకటి బేతంపూడి, రెండోది సులానగర్‌గా ఉన్నాయి. మాన్యువల్ రికార్డులు ఉన్న రోజుల్లో అధికారులు నెట్టుకొచ్చారు. ఆన్‌లైన్ వచ్చిన నాటి నుంచి రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతు భరోసా' పథకం లబ్ధిదారులను గుర్తించే పనిలో ఉంది. ఇందుకోసం అధికారులు ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో భూముల గందరగోళం మధ్య లబ్ధిదారులను, వ్యవసాయేతర భూమిని ఎలా గుర్తిస్తారోనని ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ మంత్రి ఉండడంతో సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఒకే సర్వే నెంబర్‌తో మొదలు..

బేతంపూడి పహాణీలో 1 నుంచి 68వ సర్వే నెంబర్ వరకు బేతంపూడిలోను మళ్లీ 1 నుంచి 48 వరకు కోయగూడెం లోను, సులానగర్ పహాణీలో 1 నుంచి 68 వరకు సులానగర్, కోయగూడెం గ్రామాల్లో ఉండటం వల్ల ఆన్‌లైన్‌కు వచ్చే సరికి ఈ మూడు నెంబర్ల భూములు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నా సర్వే నెంబర్లు ఒక్కటే కావడంతో రైతులకు పట్టాలు కాలేదు. అలాగే 169 నుంచి 336 సర్వే నెంబర్ వరకు బేతంపూడి, కోయగూడెం, బద్దుతండా, కుంటల్ల, టేకులపల్లి, రోళ్ళపాడు, తొమ్మిదోమైలుతండా, తడికలపూడి గ్రామ పంచాయతీల్లో డబుల్ సర్వే నెంబర్లు ఉండడంతో వీరిలో తొలుత ఆన్‌లైన్ చేసిన రైతులకు ఇబ్బంది లేదుకానీ తర్వాత రైతులకు పట్టాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిన 337వ సర్వే నెంబర్ నుంచి 1074 వరకు ఉన్న సర్వే నెంబర్లు సింగిల్‌గానే ఉన్నాయి. వాటిలో కోయగూడెం ప్రాంతంలో ఉన్న 169వ సర్వే నెంబర్‌లో 1956 నుంచి పట్టాలు ఉన్నాయి కానీ.. సర్వే నెంబర్ ఒక్కచోట ఉన్న భూములు మాత్రం వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. గతంలో అధికారులు వాటిని సరైన విధంగా నెంబర్లు ఇవ్వకపోవడంతో ఒకేచోట భూమి లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

మునుపటి పట్టాదారు పుస్తకం

నాకు 30 ఏళ్లుగా పట్టా లేదు

నాకు మా తండ్రి స్వామి వద్ద నుంచి సర్వే నెంబర్ 17లో 4.35 ఎకరాలు, సర్వే నెంబర్ 44లో 0.31 కుంటల భూమి ఉంది. మొత్తం కలిసి నా పేరుపై 5.26 ఎకరాల భూమి వారసత్వ పట్టా 30 ఏళ్ల క్రితం వచ్చింది. కానీ.. 2012లో ఆన్‌లైన్ చేసే క్రమంలో నా నెంబర్ మీద సులానగర్ రైతులకు పట్టా ఇచ్చారు. దీంతో నాకు పట్టా ఇప్పటివరకు రాలేదు. రైతుబంధు రాలేదు. బ్యాంక్ రుణమాఫీ కాలేదు. భూమి ఉండి కూడా లబ్ధి పొందలేకపోతున్నాం.

-చిట్టిబోయిన ముత్తయ్య, బేతంపూడి, టేకులపల్లి

వారసత్వ భూమికి పట్టా రావట్లేదు..

నాకు వారసత్వంగా బేతంపూడి పహాణీలో సర్వే నెంబర్ 18లో 0.20 కుంటల భూమి వచ్చింది. దానిని నా పేరు మీదకు మార్చాలని అనేకసార్లు దరఖాస్తు చేశాను. అయినా పట్టా రాలేదు. సులానగర్, బేతంపూడి రెండు భూమి రికార్డులకు ఆన్‌లైన్‌లో ఒకే రెవెన్యూ గ్రామం వల్ల పట్టాలు కావడం లేదని అధికారులు చెబుతున్నారు.

-జంగిలి సాంబశివరావు, బేతంపూడి, టేకులపల్లి

ప్రతిపాదనలు పంపాం..

టేకులపల్లి మండలంలో మొత్తం ఆరు రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వాటిలో అతిపెద్దది బేతంపూడి. దీనికి బేతంపూడి, సులానగర్ రెండు పహాణీలు ఉండడం వల్ల ఆన్‌లైన్‌లో ఆర్ఓఆర్‌లో విస్తీర్ణ సమస్యలు ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు విన్నవించాం. బేతంపూడి రెవెన్యూ విలేజ్‌లో సులానగర్ డమ్మీ రెవెన్యూ గ్రామానికి ప్రతిపాదన సైతం పంపాం. భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక రెవెన్యూ విలేజ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

-నాగభవాని, టేకులపల్లి తహసీల్దార్

బ్యాంకుల వద్ద పెట్రోలింగ్ ముమ్మరం

బ్యాంకు భద్రతా ఏర్పాట్లపై సమీక్షలో సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, జనవరి 17: బ్యాంకుల వద్ద రాత్రిపూట పెట్రోలింగ్ ముమ్మరం చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. బ్యాంకుల భద్రత, ఏటీఎంలలో నగదు రవాణా సమయంలో తీసుకుంటున్న భద్రతా చర్యలపై నగరంలోని బ్యాంకు అధికారులతో సీపీ శుక్రవారం సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో ఏవైనా భారీ లావాదేవీలు జరిగినప్పుడు సంబంధిత శాఖకు చెందిన బ్యాంకు మేనేజర్ అభ్యర్థన మేరకు ఆరోజు పోలీస్ పెట్రోలింగ్ బ్యాంకుల వద్ద ఉండేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు. బ్యాంకుకు ఏదైనా ముప్పు లేదా పోలీసుల నుంచి సహాయం కావాలని సంబంధిత మేనేజర్ అభ్యర్థించిన ప్పుడు ఆలస్యం లేకుండా స్థానిక పోలీసులు సహాయం అందిస్తారని తెలిపారు.

బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ముఖ్యంగా భద్రతా ప్రయోజనాల కోసం బ్యాంకు పేరుతో తుపాకి లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బ్యాంకు మేనేజర్లకు సూచించారు. బ్యాంకు సమీప ఇళ్లు, పరిసరాల్లో ఎవరు నివసిస్తున్నారో సెక్యారిటీ చెక్ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో పాల్వంచను కలపొద్దు

గవర్నర్‌కు గిరిజన, ఆదివాసీ సంఘాల విజ్ఞప్తి



గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘాల నేతలు

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కానున్న కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో పాల్వంచ మున్సిపాలిటీని కలపొద్దని, ఇది రాజ్యాంగ విరుద్ధమని గిరిజన, ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై శుక్రవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. పాల్వంచ ప్రాంతం గిరిజన చట్టాల పరిధిలో ఉంటుందని, 2008లో పాల్వంచను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు అక్కడ ఎన్నికలు కూడా నిర్వహించలేకపోయారని సేవాలాల్ సేన అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగూడెం పక్కనే ఉన్న చిట్టిరామారానికి సంబంధించిన 7 వార్డులను కూడా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోకి తీసుకెళ్లారని, దీనిని కూడా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో టీఎస్‌టీటీఏఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు వీరునాయక్, కార్యదర్శి బానోతు రాములునాయక్, భూక్యా రమేశ్ రాథోడ్, టీఎస్‌టీటీఏఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు భూక్యా మంగ్యానాయక్, ఆ సంఘం భద్రాద్రి జిల్లా నాయకులు సపావత్ బాలకృష్ణ చౌహాన్, భట్టు వీరన్న, భట్టు కృష్ణ, పర మేష్, ఆదివాసీ రాష్ట్ర నాయకులు బడిస భిక్షం, ఎలహేచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు రమేశ్, సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్లు బానోతు హుస్సేన్‌నాయక్, లకావత్ భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఆ భూములకు రైతుభరోసా కట్

- కూసుమంచి పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య
- గ్రామాల్లో వెంచర్లు, సాగుకు యోగ్యంకాని భూముల పరిశీలన

కూసుమంచి మండలంలోని వెంచర్లను పరిశీస్తున్న డీఏవో పుల్లయ్య, అధికారులు

కూసుమంచి, జనవరి 17: వ్యవసాయ యోగ్యంకాని భూములకు రైతు భరోసా ఇచ్చేది లేదని, దీనిపై సోమవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) పుల్లయ్య తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వెంచర్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. గుర్వాయిగూడెం, గట్టుసింగారం, చేగొమ్మ, జుర్ఖుట్‌రావుపేట, జీళ్ళచెరువు తోపాటు అనేక గ్రామాల్లో వ్యవసాయం చేయకుండా గతంలో రైతుబంధు పొందిన వారి వివరాలు ప్రస్తుత సర్వేతో బయటకు వస్తున్నాయని, ఇకనుంచి వారికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతు భరోసా వచ్చే పరిస్థితి లేదన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ చేపడుతున్న సర్వే శనివారంతో ముగియనున్నదని, సోమవారం నుంచి నిర్వహించే గ్రామసభల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ సరిత, తహసీల్దార్ కరుణశ్రీ, వ్యవసాయాధికారి రామడుగు వాణి, ఏఈవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరి, మిర్చి పంటల పరిశీలన

గట్టుసింగారం, పెరికసింగారం గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిర్చి తోటలు, వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వరిలో ఆకు చుట్టు తెగులు సోకుతున్నదని, నివారణకు క్లోరిపైరిపాస్, ఎసిఫేట్, కార్బాఫ్, హైడ్రోక్లోరైడ్ వంటి పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఏడీఏ సరిత, ఏవో వాణి, ఏఈవో రవితేజ పాల్గొన్నారు.

'పరస్పరం'.. కాసులమయం!

- ఉపాధ్యాయుల మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు రూ.లక్షల్లో ఒప్పందాలు
- 317 జీవో బదిలీల కోసం జిల్లాలో 45 మంది టీచర్ల దరఖాస్తు
- నేడు డీఈవో కార్యాలయంలో సర్వీస్ రిజిస్టర్ల పరిశీలన

ఉపాధ్యాయుల మ్యూచువల్ (పరస్పర) ట్రాన్స్‌ఫర్లు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. సీనియార్టీ ఆధారంగా గతంలో జీవో 317 ప్రకారం బదిలీలు జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలో సర్వీసులో జూనియర్ అయిన వారు కొందరు కోరుకున్న స్థానాలకు కాకుండా.. ఇతర జిల్లాకు అలాట్ అయ్యారు. అయితే 317 జీవోలో ఇతర జిల్లాలకు కేటాయించబడిన ఉపాధ్యాయులు కోరుకున్న జిల్లాలకు వచ్చేందుకు ప్రభుత్వం మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పించనున్నది. ఈ నేపథ్యంలో మ్యూచువల్‌కు అంగీకారం తెలిపే టీచర్లతో రూ.లక్షల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన దరఖాస్తులు సైతం స్వీకరించారు. మ్యూచువల్ బదిలీకి దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం (ఈ నెల 18న) డీఈవో కార్యాలయంలో సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించనున్నారు. -ఖమ్మం అర్బన్, జనవరి 17

ముమ్మరంగా ఇంటర్వ్యూలు

మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్‌లో ఎక్కువగా త్వరలో ఉద్యోగ విరమణ పొందేవారే ఉన్నారు. దీంతో స్థానిక జిల్లాలను వదులుకొని ఇతర జిల్లాలకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగ విరమణ అనంతరం బెనిఫిట్స్ ఎలాగూ ఇవ్వకపోవడంతో కొన్ని నెలల్లో ఉద్యోగ విరమణ పొందే కొందరు ఉపాధ్యాయులు ఇలాగైనా సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో మ్యూచువల్‌కు అంగీకారం తెలుపుతున్నారు. ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు సైతం మ్యూచువల్ కోరుకునే వారిలో ఉన్నారు. దీంతో ఇప్పటికే వాట్సాప్ గ్రూప్‌లలో సమాచారం షేర్ చేయడం.. ఎవరెవరు మ్యూచువల్ కోరుకుంటున్నారో వివరాలు తెలుసుకుని వారితో ఆర్థికపరమైన అంశాలపై చర్చించుకున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ ప్రాంతాలకు వెళ్లేవారు ఉండగా.. ఇతర ప్రాంతాల నుంచి ఖమ్మం జిల్లాకు వచ్చే వారూ ఉన్నారు. హెచ్‌ఆర్ఏ కూడా ఎక్కువ వచ్చే అవకాశం ఉండడంతో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకుపైగా డిమాండ్ ఉంది.

జిల్లాలో 45 మంది దరఖాస్తులు

మ్యూచువల్‌కు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో జిల్లా నుంచి 45 మంది ఉన్నారు. వీరికి సంబంధించిన వివరాలను పరిశీలించి విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయానికి అందజేయాలని ఆదేశించిన నేపథ్యంలో శనివారం ఆయా వివరాలను అధికారులు పరిశీలించనున్నారు. బదిలీ కోరుకునే ఉపాధ్యాయుడితోపాటు మ్యూచువల్‌కు అంగీకారం తెలిపిన ఉపాధ్యాయుడు సైతం డిక్లరేషన్ అందజేయాలి. బదిలీ ఉపాధ్యాయులతో పాటు వారు పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణ కూడా అందజేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. దీంతో సంబంధిత ఉపాధ్యాయులు ధ్రువీకరణ పత్రం, డిక్లరేషన్‌తోపాటు సర్వీస్ రిజిస్టర్‌లో 317 జీవో ప్రకారం బదిలీ జరిగిందా? లేదా? అనే అంశాలను పరిశీలించనున్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత శనివారం నుంచి పాఠశాలలు తిరిగి తెరుచుకోనుండడంతో పరిశీలన ప్రక్రియ ప్రారంభించనున్నారు. పరిశీలనకు సోమవారం వరకు కూడా గడువు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

త్వరితగతిన పనులు పూర్తి చేయండి

గిరిజన మ్యూజియం పనుల పరిశీలనలో ఐటీడీఏ పీవో రాహుల్

కొలను పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం, జనవరి 17: ఐటీడీఏ ప్రాంగణంలో నిర్మించే ట్రైబల్ మ్యూజియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా పరికరాల ఏర్పాటు, సోలార్ విద్యుత్ లైట్ల ఏర్పాటు పనులు చాలా వరకు పూర్తయ్యాయన్నారు. పర్యాటకుల కోసం బోటింగ్‌కు ఏర్పాటు చేయనున్న కుంట (కొలను) పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యూజియం సుందరీకరణ పనులు జరుగుతున్నందున అక్కడి వస్తువులు చోరీకి గురికాకుండా దృష్టి సారించాలన్నారు. ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ ఈఈ చంద్రశేఖర్, ఎఫ్‌డీవో ఉదయ్‌కుమార్, ఏసీఎంవో రమణయ్య, డీఈ హరీశ్ పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం అయ్యేలా చూడాలి..

రైతు భరోసా నిధులు ఏజెన్సీ రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా ఆధార్ అనుసంధానం జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. దీని ప్రగతిపై ఏజెన్సీ ఎంఈవోలు, ఏఈవోలు, ఏవోలతో సమీక్షించారు. గిరిజన రైతులందరికీ ఆధార్ అనుసంధానం ప్రక్రియ రేపటిలోగా పూర్తి చేయాలని, ఏమైనా సమస్యలుంటే అధికారులు వెంటనే కలెక్టర్ లేదా తన దృష్టికి తేవాలన్నారు. భద్రాద్రి జిల్లాలో 862 మంది, ఖమ్మం జిల్లాలో 312 మంది రైతుల ఆధార్ సీడింగ్ పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఏపీవో డేవిడ్‌రాజ్, ఎంఈవోలు, ఏఈవో, ఏవోలు పాల్గొన్నారు.